
సాక్షి ఒడిశా

మంగళవారం । 18 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,58,464లు, బంగారం 13 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 154 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



దేవేంద్ర ప్రధాన్ మృతి

కేంద్ర మాజీ మంత్రి దేవేంద్ర ప్రధాన్ మృతి చెందారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. - 8లో



వినతుల వెల్లువ

గ్రీవెన్స్‌సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. సమస్యలు ఏకరువు పెట్టారు. - 8లో

న్యూస్‌రీల్

క్రీడల్లో రాణించాలి



ట్రోఫీతో పాటు రూ.40 వేల చెక్కును బహూకరిస్తున్న హిమిరిక

రాయగడ: యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర మాజీ మంత్రి, బీజేడీ సీనియర్ నాయకుడు లాల్ బిహారీ హిమిరిక అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో రాయగడ ప్రీమియర్ లీగ్ (ఆర్ పి ఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ భవిష్యత్ ఉజ్వలంగా మార్చుకునేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించే వారిని ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. ఈ టోర్నీలో పాల్గొన్న 8 జట్లలో ఫైనల్ కు విరాట్–11, రవిసేనా జట్లు చేరుకోగా విరాట్–11 జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విరాట్–11 జట్టుకు ట్రోఫీతో పాటు రూ.40 వేల నగదు బహుమతి, రన్నర్‌గా నిలిచిన రవిసేనా జట్టుకు రూ.25 వేల నగదుతో పాటు ట్రోఫీని అందించారు.

నారాయణ పాత్రోకు ఘన నివాళి



స్వాతంత్ర్య సమరయోధులు నారాయణ పాత్రో జయంతి సందర్భంగా మాట్లాడుతున్న భాగ్యలక్ష్మీ నాయక్

పర్లాకిమిడి: అవిభక్త గంజాం జిల్లా ద్వితీయ రాజ్యసభ సభ్యులు, మాజీ ఎంపీ, స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణ పాత్రో 112వ జయంతిని స్థానిక హైస్కూల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ బిజయకుమార్ దాస్, ప్రధాన అతిథిగా భాయమను చర్చి, ఉత్కళ హితేషిణీ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో, జస్టిస్ కార్నర్ అధ్యక్షులు భాగ్యలక్ష్మీ నాయక్, ప్రదీప్ కుమార్ జెన్నా, పిత్తబాస్ సామల్, గ్రామ సర్పంచు శిల్పా పాత్రో, సమతి సభ్యులు మీనాక్షి హాజరయ్యారు. నారాయణ పాత్రో సేవలను గుర్తు చేసుకుని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ పాత్రో వారసులు భార్య అనురాధ పాత్రో, కుమారుడు శ్రీకాంత పాత్రో, బుద్ధదేవ్ పాత్రోలను సత్కరించారు. గ్రామంలో అమరవీరులకు స్మృతి స్థూపం నిర్మించాలని, గురండి గ్రామాన్ని స్వాంతంత్ర్య సమర యోధుల గ్రామంగా గుర్తించాలని పూర్ణచంద్ర మహాపాత్రో డిమాండు చేశారు

గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం లభ్యం



జలాశయం నుంచి రోహన్ కాశ్యప్ మృతదేహం బయటకు తీసుకు వస్తున్న దృశ్యం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి గులిమి జలాశయంలో చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు ఇద్దరు గల్లంతైన సంగతి తెలిసిందే. వారిలో ఒకరి మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది, కొరాపుట్ ఓడ్రాఫ్ టీమ్‌లు సోమవారం కనుగొన్నాయి. మరొకరి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. హోలీ సందర్భంగా జగదల్‌పూర్, ధరమపూర్ ప్రాంతాల నుంచి 13 మంది యువకులు గులిమి పర్యాటక కేంద్రానికి పిక్నిక్ కోసం వచ్చారు. వారు జలాశయంలో స్నానం చేస్తుండగా గౌరవ బగేల్, రోహన్ కాశ్యప్‌లు నీటిలో మునిగిపోయారు. స్నేహితులు, పోలీసులు ఎంత గాలించినా వారి ఆచూకీ తెలియరాలేదు. ఎట్టకేలకు సోమవారం కాశ్యప్ మృతదేహాన్ని కనుగొన్నారు.

బొయిపరిగుడ పోలీసుస్టేషన్ ఆవరణలో అగ్ని ప్రమాదం



వాహనాలకు వ్యాపించిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసుస్టేషన్ ఆవరణలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలను ఆర్పేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేక పోవటంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే వివిధ కేసులో సీజ్ చేసి ఉంచిన పలు వాహనాలు కాలిబూడిదయ్యాయి. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియలేదు.



నయాగడ్ జిల్లాలో కాల వైశాఖి వానలు

రాష్ట్రంలో... కాలవైశాఖి వర్ష సూచన

భువనేశ్వర్:

వాతావరణ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం రాష్ట్రంలో కాల వైశాఖి వైపరీత్యం పొంచి ఉంది. దీని ప్రభావంతో గాలి వాన తుఫాను వాతావరణం అలముకుంటోంది. ఈ నెల 20 నుండి 26 వరకు అనేక జిల్లాలకు కాల వైశాఖి తుఫానుతో గాలి, ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందస్తు సమాచారం జారీ చేసింది. ఆయా జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నెల 19 వరకు రానున్న 2 రోజులు రాష్ట్రంలో తీవ్రమైన వడగాల్పులు హెచ్చరిక అమలులో ఉంది. ఝార్సుగుడ, సంబలపూర్, కలహండి, సోన్‌పూర్, బౌద్ జిల్లాలకు ఈ నెల 19 వరకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అంగుల్, బొలంగీర్, సుందర్‌గఢ్ జిల్లాలకు ఐఎండీ నారింజ రంగు హెచ్చరిక జారీ చేసింది. మయూర్‌భంజ్, కెంజొహర్, ఢెంకనాల్, గజపతి జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

2 జిల్లాల్లో ముందస్తుగా కాల వైశాఖి వాన

నువాపడా, నయాగడ్ 2 జిల్లాల్లో ముందస్తుగా కాల వైశాఖి వాతావరణం ఆవహించింది. దీని ప్రభావంతో స్థానికులు ఎండ వేడిమి నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగింది. నువాపడా జిల్లా కొమనా మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని చోట్ల వడగళ్లు రాలాయి. నయాగడ్ జిల్లా దసపల్లా, గొణియా, ఖొండొపాడా, భాపూర్ తదితర ప్రాంతాల్లో కాల వైశాఖి ప్రభావంతో పెను గాలులతో కూడిన వర్షం కురిసింది.




నువాపడా జిల్లాలో రాలిన వడగళ్లు



దసపల్లా పరిసర ప్రాంతాల్లో తుపాను వాతావరణం

ట్రక్కు–బైక్ ఢీ: బాలిక దుర్మరణం



ప్రమాదం జరిగిన ప్రాంతంలో పోలీసులు

జయపురం: జయపురం హటపాదర్ గ్రామ ప్రాంతంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందగా ఆమె తండ్రి గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి స్థానిక క్రిష్టియన్ పేట కోర్టు లైన్‌లో ఉంటున్న పాస్టర్ రెవరెండం అమరేషు బేణు. మరణించిన బాలిక అతని కుమార్తె అంజల కె.బేణు(3). పోలీసు అధికారి వివరణ ప్రకారం.. ఆదివారం రాత్రి అమరేషు వేణు తన కుమార్తెతో హటొపాదర్ ప్రాంతంలో గల ఒక ప్రైవేటు ఆస్పత్రికి బైక్‌పై బయల్దేరారు. ఆ సమయంలో సెమిలిగుడ నుంచి ఒక ట్రక్కు జయపురం వైపు వస్తోంది. 26వ జాతీయ రహదారిలో అతివేగంగా వస్తున్న ఒక ట్రక్కు హటొపాదర్ వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమరేషు వేణుకి తీవ్రమైన గాయాలు కాగా అతడి కుమార్తె మృతి చెందింది. సమాచారం అందిన పట్టణ పోలీసు అధికారి ఈశ్వర తండి స్.ఐ రాజేశ్వర పంగి పోలీసు సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకొన్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో జనంగుమిగూడారు. అతి కష్టంతో జనాన్ని తప్పించి ట్రక్కుని పోలీసులు సీజ్ చేశారు.

పరిహారం డిమాండ్ చేస్తూ రాస్తారోకో

గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలిక కుటుంబానికి పరిహారంతో పాటు పాస్టర్ వైద్యానికి తగిన ఆర్థిక సాయం అందించాలని క్రిష్టియన్ పేట ప్రజలు, యువకులు 26 వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసు అధికారి ఈశ్వర తండి ఆందోళన కారులతో చర్చించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



ఆందోళనకారులను శాంతింపజేస్తున్న పోలీసు అధికారి తండి



రాస్తారోకోలో పాల్గొన్న ప్రజలు, నిలిచి పోయిన వాహనాలు



గత రాత్రి ట్రక్కును అడ్డుకున్న జనం

బీడీ ఆకుల గిడ్డంగి నైట్‌వాచ్‌మెన్ ఆత్మహత్య

జయపురం: జయపుం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బొరిగుమ్మలో గల ఖెందు పత్ర(బీడీ ఆకులు) గిడ్డంగి నైట్ వాచ్‌మెన్ ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. బొరిగుమ్మ సమితి కమతా గ్రామం భాస్కర మహంకుడో ఖెందు పత్ర విభాగంలో గత కొన్నేళ్లుగా రాత్రి కాపలాదారునిగా పనిచేస్తున్నాడు. ఉదయం అతడి అక్క కుమార్తె పలుమార్లు ఫోను చేసినా మహంకొడో ఫోను ఎత్త లేదు. దీంతో కుటుంబ సభ్యులు బొరిగుమ్మ ఖెందూపత్ర విభాగ కార్యాలయానికి వెళ్లి చూడగా కార్యాలయంలో ఫ్యాన్‌కు వేలాడుతూ అతడు విగత జీవుడై వారికి కనిపించాడు. వెంటనే కమతా గ్రామంలో అతడి బంధువు రవీంద్ర హియాల్ బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బొరిగుమ్మ పోలీసులు వెంటనే సంఘటనా ప్రాంతానికి వెళ్లి మహంకుడో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం పంపించారు. అతడి ఫ్యాంట్ జేబులో సూసైడ్ నోట్ దొరికిందని దర్యాప్తు అధికారి ఎ.ఎస్.ఐచందన ప్రసాద్ మహి వెల్లడించారు. ఆ సూసైడ్ నోట్ లో ఖెందూలీఫ్ విభాగం రేంజర్ సదాశివ మిశ్ర తనను మానసికంగా వేధిస్తున్నాడని అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడని పోలీసులు తెలిపారు. సూసైడ్ నోటు స్వాధీన పరచుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు భాస్కర మహంకుడో మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక అతడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.


వృద్ధుని మృతదేహం స్వాధీనం



లక్ష్మీ చరణ్ శతపతి (ఫైల్)

రాయగడ: స్థానిక మజ్జిగౌరీ మందిరానికి సమీపంలోని పొదల్లో వృద్ధుని మృతదేహాన్ని పోలీసులు గుర్తించి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు లక్ష్మీచరణ్ శతపతి (71)గా గుర్తించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన కుటుంబ సభ్యులతస కలిసి మజ్జిగౌరీ దర్శనానికి శతపతి వచ్చారు. దర్శనం చేసుకున్న తరువాత కొద్దిసేపు తన కుటుంబీకులతో గడిపిన ఆయన ఆయన బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు వెతికినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో. సదరు పోలీస్ స్టేషన్‌లో అదేరోజున ఫిర్యాదు చేశారు. బరంపురంలోని లంజిపల్లి ప్రాంతానికి చెందిన ఆయన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. కొద్ది రోజుల తరువాత అతని మతిస్థిమితం పోయిందని కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మజ్జిగౌరీ మందిరం సమీపంలో అతని మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగౌరీ చైత్రోత్సవాలకు శ్రీకారం



మజ్జిగౌరీ అమ్మవారు



రాటను ముస్తాబు చేసి తీసుకువస్తున్న పూజారులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్టు సభ్యులు

- సంప్రదాయబద్ధంగా ముహూర్తపు రాట

రాయగడ: రాయగడ ప్రజల ఇలవేల్పు, ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరీ అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలకు సన్నహాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ ఎనిమిది నుంచి 12వ తేదీ వరకు జరగనున్న అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి సోమవారం మూహూర్తపు రాట కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధి నుంచి మూహూర్తపు రాటను ముస్తాబు చేసి పురోహితులు తీసుకురాగా మందిరం ప్రాంగణంలో రాటను వేశారు. దీంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లుగా భావించి ఏర్పాట్లలకో కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, వద్దాది శ్రీనివాసరావు, పెద్దీన వాసు, బాబు దొలాయి. దేవేంద్ర బెహర, మందిర సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు కోసం సోదరుడి కిడ్నాప్



అభిజిత్ సారను అపహరించేందుకు వినియోగించిన కారు

జయపురం: జయపురం విమానాశ్రయ విస్తరణకు స్థలాన్ని అమ్మిన యువకుడిని అతడిని కుటుంబ సభ్యులే అపహరించారు. నిందితులను అరెస్టు చేశామని జయపురం సదర్ పోలీసు స్టేషన్ అధికారి సచీంద్ర ప్రధాన్ తెలిపారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. సొరగుడ గ్రామ వాసి అభిజిత్ సొర ఆరేళ్ల కిందట జయపురం విమానాశ్రయ విస్తరణ కోసం భూసేకరణ సమయంలో తన నానమ్మ భూమి అమ్మగా రూ.40 లక్షలు లభించాయి. ఆ డబ్బులో రూ.20 లక్షలతో కొత్త ఇల్లు కట్టుకున్నాడు. రూ.12 లక్షలతో ఒక ట్రాక్టర్, రూ.3 లక్షలతో ఇంటి సామానులు ఖరీదు చేశాడు. మిగిలిన డబ్బు అభిజిత్ సొర తండ్రి భగవాన్ సొర బ్యాంక్ ఖాతాలో వేశాడు. అయితే భూమి అమ్మిన డబ్బులో తనకూ వాటా ఉంటుందని అభిజిత్ సొర కజిన్ శంకర సొర డిమాండ్ చేసేవాడు. అందుకు అభిజిత్ నిరాకరించేవాడు. అయితే ఈ నెల 2వ తేదీన సాయంత్రం అభిజిత్ సొర, మరో యువకుడితో మరుభూమికి కెనాల్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కారులో శంకర సొర మరో నలుగురు యువకులతో వచ్చాడు. అభిజిత్‌ను కారు ఎక్కించుకుని డబ్బులు డిమాండ్ చేశారు. లేకపోతే చంపేస్తామని కుటుంబ సభ్యులను కూడా బెదిరించారు. విషయం తెలిసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దీంతో నిందితులు ఈ నెల 4 వ తేదీన కొరాపుట్–రాయగడ మార్గంలో అభిజిత్‌ను విడిచి వారు పారి పోయారు. అపహరణకు గురైన అభిజిత్‌ను పోలీసులు విచారించగా అనేక విషయాలు బయటకు వచ్చాయి. అనంతరం నిందితులను అరెస్టు చేశారు.

యువకుడు ఆత్మహత్య



అంగద్ నిషిక మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

రాయగడ: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లాలోని బిసంకటక్ పోలీస్‌స్టేషన్ పరిధి బిర్లాగుడలో ఈ సంఘటన చోటుచేసుకోగా.. మృతుడు అదే గ్రామానికి చెందిన అంగద్ నిషిక (22)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని బిసంకటక్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. అంగద్ నిషిక ఆదివారం సాయంత్రం వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. అదే సమయంలో అతని భార్య ఇంటి బయట దుస్తులు ఆరేస్తుంది. ఇంటి లోపలకు వెళ్లిన అంగద్ నిషిక లోపల నుంచి తలుపు గడియ పెట్టి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బట్టలు ఆరేసిన తరువాత ఇంట్లోనికి వెళ్లేందుకు భార్య తలుపులు తట్టగా గడియ పెట్టి ఉండడం.. .లోపల ఉన్న భర్త మాట్లాడకపోవపంతో అనుమానం వచ్చి ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయాన్ని తెలియజేసింది. ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూడగా ఇంటి పైకప్పుకు తాడుతో వేలాడుతూ అంగద్ కనిపించాడు. వెంటనే కిందకు దించి బిసంకటక్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కొరాపుట్‌లో సినిమా కళ



వాలీబాల్ ఆడుతున్న రాజమౌళి (ఇన్‌సెట్లో) బల్దా ప్రాంతంలో షూటింగ్ వాహనాల పరుగులు

కొరాపుట్: భారీ చిత్రాల దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కొరాపుట్‌లో స్థానికులతో కలిసిపోతున్నారు. స్థానిక గిరిజన యువకులతో వాలీబాల్ ఆడుతూ సేద తీరుతున్నారు. సోమవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి దేవమాలి పర్వతం సమీపంలో తులమాలి పర్వతం దిగువ నున్న టంకు బెడా గ్రామంలో స్థానిక యువకులతో వాలీబాల్ ఆట ఆడారు. ఎలాంటి భేషజాలు లేకుండా సాధారణ వ్యక్తి లాగానే కలిసిపోయారు. అలాగే ఇక్కడ తన చిత్ర షూటింగ్ జరుగుతుండడంతో స్థానికులకు చిన్నచిన్న పాత్రలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో జయపూర్ కి చెందిన సీనియర్ పాత్రికేయుడు సుమంత్ సాహు(లిట్టు) ఓ పాత్ర కోసం ఇంటర్వ్యూ కూడా చేశారు. ఆయన గతంలో పలు చిత్రాల్లో నటించారు కూడా. మరో వైపు ఇదే జిల్లాలో నందపూర్ సమితి బల్దా ప్రాంతంలో నాగేశ్వరి గుహల ప్రాంతంలో షూటింగ్ బృందం పర్యటిస్తోంది. ఇక్కడ కూడా కొన్ని దృశ్యాలు చిత్రీకరణ జరపడానికి పరిశీలిస్తోంది. గతంలో ఇదే ప్రాంతంలో సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో అత్యధిక ప్రాంతం చిత్రీకరణ చేశారు.





వాలీబాల్ కోర్టులో రాజమౌళి



రాజమౌళితో సుమంత్ సాహు

క్లుప్తంగా

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 14 బీఈడీ కళాశాలల మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలోని బీఆర్ఏయూ, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, పలాస, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రాజాంలోని జీసీఎస్ఆర్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. 1220 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఈనెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. వర్సిటీ ఆర్ట్సు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ వర్సిటీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి



రంగోయి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

పలాస: అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు సూచించారు. మండలంలోని రంగోయి, పెంటిభద్ర అంగన్‌వాడీలు, బాలసదనం తదితర కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న బాలింతలు, బాలలు, గర్భిణులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. కేంద్రాల్లో మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెంటిభద్రలో శిథిలావస్థలో ఉన్న బావిని పూడ్చాలని ఎంఈవో శ్రీనివాసరావును ఆదేశించారు. ఆయనతో పాటు బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, సభ్యుడు ఎం.గన్నప్పుడు, జిల్లా బాలల రక్షణాధికారి మెట్ట మల్లేశ్వరరావు, జీసీడీవో ఎస్.నీరజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.లత, ఎస్.సరస్వతి, గంగమ్మ తదితరులు ఉన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్: చాక్లెట్ ఆశజూపి చిన్నారిపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నంచిన ఘటన జిల్లా కేంద్రంలోని పుణ్యపు వీధిలో శనివారం చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దపాపకు ఆరేళ్లు ఉండగా, చిన్న పాపకు నాలుగేళ్లు. అయితే ఎదురు అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వృద్ధుడు గత కొంతకాలంగా చిన్నారులను మచ్చిక చేస్తూ ఆడించేవాడు. ఎప్పటిలాగే శనివారం కూడా పెద్ద పాపను పిలిచి మాయమాటలు చెప్పి అసభ్యకరరీతిలో తాకేయత్నం చేశాడు. ఇది గమనించిన ఒక మహిళ బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేయడంతో వృద్ధుడిని అతని భార్య ఎదుటే నిలదీశారు. దీంతో వృద్ధుడు తప్పు అయిపోయిందని కాళ్లావేళ్లా పడ్డాడు. ఇరువైపులా బంధువులు వచ్చి సర్ది చెప్పడంతో ఫిర్యాదు చేయకుండా తల్లిదండ్రులు ఆగిపోయారు. అయితే పాపకు జరిగినట్లు మరొకరికి జరగకూడదనే ఉద్దేశంతో తప్పును ఎలాగైనా బయటపెట్టాలని ఆ భార్యభర్తలు అనుకున్నారు. దీంతో సోమవారం ఉదయం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లను ఆశ్రయించారు. వెంటనే పోలీసులు వృద్ధుడిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అప్పటికే విషయం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దృష్టికి వెళ్లడం, చట్టపరంగా చర్యలు తీసుకోమని చెప్పడంతో, చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు.

దేశ భద్రతలో యువత భాగస్వాములవ్వాలి



ర్యాలీగా వెళ్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

రణస్థలం: దేశ భద్రతలో యువత భాగస్వాములవ్వాలని సీఐఎస్ఎఫ్ జవాన్లు పిలుపునిచ్చారు. సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పే, డిప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో 80 మంది సభ్యుల సైకిల్ యాత్ర సోమవారం రణస్థలం చేరుకుంది. దీంతో వీరికి తహసీల్దార్ ఎన్.ప్రసాద్, వివిధ పాఠశాలల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్‌పై సీఐఎస్ఎఫ్ విధులు, దేశ భద్రతలో పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసి 56 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పశ్చిమబెంగాల్‌లోని బకెలి నుంచి ఒక బృందం, గుజరాత్‌లోని లఖపథ్ నుంచి ఒక బృందం సైకిల్ యాత్ర ప్రారంభించామని తెలిపారు. 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు 6,553 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టి మార్చి 31న కన్యాకుమారిలో ముగిస్తామన్నారు. మాదక ద్రవ్యాల రవాణా నిషేధం, అక్రమ ఆయుధాల నివారణ, తీరప్రాంత భద్రత, తీవ్రవాదుల చొరబాటు నివారణ, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నామని వెల్లడించారు. సమృద్ధ్ సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలను భద్రతా సిబ్బందితో మమేకం చేస్తున్నామని తెలిపారు.

వినతుల వెల్లువ



మల్కన్‌గిరి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

మల్కన్‌గిరి: జిల్లా పోడియా సమితిలో కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. సమితి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 39 వినతులు స్వీకరించారు. సమితిలో ఉన్న సమస్యలపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఎస్పీ వినోద్ పటేల్, మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, పోడియ సమితి ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

బిసంకటక్‌లో..

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహోట, జిల్లా అటవీ శాఖ అధికారి అన్నా సాహేబ్ అహోలే, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 39 వినతులను స్వీకరించారు. నాలుగు గ్రామ సమస్యలుగా గుర్తించారు. మిగతావి వ్యక్తి గత సమస్యలుగా నిర్ధారించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. వినతుల్లో అత్యధిక శాతం మౌలిక సౌకర్యాల కల్పించాల్సినవిగా అధికారులు గుర్తించారు.



మల్కన్‌గిరి: సమస్యలు వింటున్న కలెక్టర్, అధికారులు

రాయఘడ బ్లాక్ డోంబాలో..

పర్లాకిమిడి: జిల్లాలో రాయఘడ బ్లాక్ డోంబాలో గ్రామ పంచాయతీలో సోమవారం గ్రామముఖి పరిపాలన, స్పందన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్య నిర్వహణ అధికారి శంకర్ కెరకెటా తదితరులు హాజరయ్యారు. స్పందనకు 137 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 55, గ్రామ సమస్యలు 82 ఉన్నాయి. వాటిలో ఒక వినతిని అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. ఎక్కువగా స్పందన కార్యక్రమానికి పీఎం ఆవాస్ యోజనా, రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, భూ పట్టాలకు సంబంధించినవి ఉన్నాయి. గ్రీవెన్స్ సెల్‌కు రాయఘడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, వైస్ చైర్‌పర్సన్ జ్యోతి ప్రసాద్ పాణి, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ అధికారి అంశుమాన్ మహాపాత్రో, సీడీఎంఓ డాక్టర్ ఎం.ఎం. అలీ, తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: గ్రీవెన్స్‌లో పాల్గొన్న అధికారులు



పర్లాకిమిడి: డోంబాలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం

ఐదేళ్లలో 74 మంది నక్సలైట్లు లొంగుబాటు: సీఎం



శాసన సభ ప్రశ్నోత్తరాల్లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: శాసన సభలో బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కొనసాగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పలు కీలక ప్రశ్నలకు సమాధానాలను లిఖితపూర్వకంగా ప్రవేశ పెట్టారు.

నక్సలైట్ల లొంగుబాటు

రాష్ట్రంలో గత ఐదేళ్లలో 74 మంది నక్సలైట్లు లొంగిపోయారని ముఖ్యమంత్రి తెలిపారు. 2020 సంవత్సరం జనవరి 1, 2024 సంవత్సరం డిసెంబర్ 31 మధ్య 74 మంది నక్సల్స్ లొంగిపోయి ప్రధాన జన ప్రవంతిలో విలీనమై సాధారణ జీవనం పునః ప్రారంభించారని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర శాసన సభలో తెలియజేశారు. బొడొంబా నియోజక వర్గం స్వతంత్ర్య ఎమ్మెల్యే బిజయ కుమార్ డాలబెహెరా అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో లొంగిపోయిన 74 మంది మావోయిస్టులలో 50 మందికి ప్రభుత్వం పునరావాసం కల్పించిందని పేర్కొన్నారు. దీని కోసం ప్రభుత్వం రూ. 1,49,44,000 ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం లొంగుబాటు మరియు పునరావాస పథకం ప్రామాణికల ప్రకారం వారిని అర్హులుగా పరిగణించారు.

3738 మంది బంగ్లాదేశ్ చొరబాటుదారుల బహిష్కరణ

బంగ్లాదేశ్ చొరబాటుదారులను గుర్తించి వారి స్వదేశానికి పంపించేదుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఈ నేపథ్యంలో అన్ని జిల్లా కలెక్టర్లు మరియు భద్రతా అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం రాష్ట్ర శాసన సభలో తెలిపారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి, బ్రహ్మగిరి నియోజక వర్గం ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్రో అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 3,738 మంది బంగ్లాదేశ్ జాతీయులు అక్రమంగా నివసిస్తున్నారని వెల్లడించారు. ఈ చొరబాటుదారులు ప్రధానంగా జల మార్గాల ద్వారా ఒడిశాలోకి ప్రవేశిస్తున్నారని ఆయన వివరించారు. వీరందర్ని సురక్షితంగా స్వదేశానికి తరలించేందుకు అక్రమ నివాసితులను గుర్తించి వారి స్వదేశానికి బహిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టర్లు, భద్రతా అధికారులను ఆదేశించింది.

పురుగు మందుతాగి యువకుడు మృతి



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద మంటు రాయ్ మృతదేహం

మల్కన్‌గిరి: యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి అంబాగూఢ పంచాయతీ ఎంపీవీ 31 గ్రామంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకోగా.. మంటు రాయ్ (20) హోలీ ఆడేందుకు తోటి యువకులతో కలిసి శనివారం వెళ్లి తిరిగి రాలేదు. అయితే స్నేహితులతో ఉండి ఉంటారని తల్లిదండ్రులు భావించారు. అయితే ఆదివారం సాయంత్రం తన మేనమామ మహనాందో బిశ్వస్‌కు మంటు రాయ్ ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ పురుగు మందు సీసాను ఫొటో తీసి పంపాడు. ఈ విషయాన్ని వెంటనే కలిమెల పోలీసులు, యువకుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. పోలీసులు, తల్లిదండ్రులు కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. పోలీసు చెక్‌పోస్టు సమీపంలో రహదారిపై మంటు రాయ్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోరుకొండ సమితిలో యువకుడు బలవన్మరణం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి బలిమెల పోలీసుస్టేషన్ పరిధిలో కుడుముల గూమ్మా పంచాయతీ దండసేనగూఢ గ్రామంలో సోమవారం సాయంత్రం యువకుడి రామ్‌చంద్ర దండసేన మృతదేహం చెట్టుకు వేల్లాడుతూ కనిపించింది. అదే గ్రామానికి చెందిన రామ్‌చంద్ర దండసేన (25) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి భోజన సమయానికి ఇంటికు రాలేదు. దానితో తండ్రి కైలాస్ చంద్ర దండసేన స్థానికంగా వెతుకలాట చేశారు. అయితే గ్రామం శివారులోని మైదానంలో గలని ఇప్ప చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి బలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ దీరాజ్ పట్నాయిక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు రామ్ చంద్ర దండసేన జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.



చెట్టుకు వేలాడుతున్న రామ్ మృతదేహం

గంజాయి అక్రమ రవాణా గుట్టు రట్టు



పొట్టంగి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణా గుట్టు రట్టయింది. అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రహస్యంగా దాచిన ఏడు క్వింటాళ్ల 97 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వేకువజామున కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి జుబరాజ్‌పేట అటవీ ప్రాంతంలో భారీ ఎత్తున్న గంజాయి అక్రమ రవాణాకి సిద్ధం చేసినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అధిక సంఖ్యలో పోలీసులు రాత్రి సమయంలో అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులను చూసిన గంజాయి స్మగ్లర్లు పరారయ్యారు. ఆ ప్రాంతంలో 77 బస్తాలలో రవాణాకు సిద్ధంగా ఉంచిన 7 కి 97 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పొట్టంగి పోలీసులు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శ్రీ మందిరం నిషేధిత పరిధిలో డ్రోన్ చిత్రీకరణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథ్ దేవస్థానం భద్రతా వ్యవస్థ మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఆలయ శిఖరం నుంచి డ్రోన్ చిత్రీకరణ వెలుగు చూసింది. ఆలయ శిఖరం నుంచి ప్రధాన దేవస్థానం లోపలి, వెలుపలి ప్రాకార ప్రాంగణాల్లో అపురూప దృశ్యాల చిత్రీకరణ జరిగింది. ఈ చిత్రీకరణ సాంఘిక మాధ్యమంలో ప్రసారం కావడంతో కలకలం రేపింది. శ్రీ జగన్నాథ ఆలయ శిఖరం విహంగ నిషేధిత (నో ఫ్లయింగ్ జోన్) పరిధిగా ప్రకటించారు. ఈ నిషేధిత ప్రాంతంలో డ్రోన్ ఎగురుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మనీష్ సోలంకి అనే వ్యక్తి తన యూట్యూబ్ చానెల్‌లో ఆలయ వీడియోను అప్‌లోడ్ చేశారు. ఇందులో ఆలయ లోపలి ఆవరణ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీడియో 7 రోజుల క్రితం అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తుంది. అయితే దీని వీడియో చిత్రీకరణ ఎప్పుడు జరిగిందనే దానిపై స్పష్టమైన సమాచారం అందుబాటులో లేదు.

గుండెపోటుతో జేఈ మృతి



జేఈ వివేకానంద మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి భేజంగివాడ, గంపకొండ పంచాయతీల్లో అభివృద్ధి పనుల నిమిత్తం నియమించిన జేఈ వివేకానంద ప్రదాన్ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. తెల్లవారు జామున గుండె భారంగా ఉందని పక్కనే ఉంటున్న మరో ఉద్యోగి జయకృష్ణకు జేఈ వివేకానంద చెప్పడంతో వెంటనే అంబులెన్స్‌లో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వివేకానంద మృతి చెందారు. ఈయన స్వస్థలం కేంజోర్ జిల్లా వాసి. కలిమెల సమితిలో మూడు సంవత్సరాలుగా పని చేస్తున్నారు. మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రం మార్చురీలో ఉంచామని.. కుటుంబ సభ్యులు వచ్చిన తరువాత వారికి అప్పగిస్తామని అధికారులు తెలిపారు.

మిల్లులో బాల కార్మికుడు మృతి

జయపురం: జయపురం సదర్ పోలీసు పరిధి రొండిపల్లి గ్రామంలో గల గుప్తేశ్వర్ రైస్ మిల్లులో ఓ బాల కార్మికుడు మృతి చెందినట్లు జయపురం సదర్ పోలీసు వర్గాలు వెల్లడించాయి. గుప్తేశ్వర్ రైస్ మిల్లు పై కప్పు టిన్ రేకులు మార్చుతున్న సమయంలో అతడు జారిపడ్డాడు. ఈ సంఘటనలో 17 యేళ్ల బాల కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన తెలిసిన వెంటనే జయపురం సదర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని బాలుడిని జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడిని పనిలో నియమించిన కాంట్రాక్టర్ బొడొకావిడి గ్రామం ఎల్.పైడిరాజు(57)ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరణ ప్రకారం.. గుప్తేశ్వర్ ఫ్లోర్ మిల్లు పైకప్పు(రూఫ్) పైన గల పాడైన టిన్ రేకులు మార్చేందుకు కొంత మంది పనివారిని నియమించారు. వారిలో బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ పోలీసు స్టేషన్ పరిది లటిగుడ గ్రామం బలరాం బొయిపారి(17) కూడా ఒకడు. ఆ బాలుడు మిల్లు పైకప్పుపై పనిచేస్తుండగా అకస్మాత్తుగా జారి కింద పడ్డాడు. అలా పడటం వల్ల అతడి తలకు, ఛాతీకి బలమైన గాయాలు అయ్యాయి. జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారని పోలీసులు వెల్లడించారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని కూలీలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర మాజీ మంత్రి దేవేంద్ర ప్రధాన్ మృతి



విమానాశ్రయ ప్రాంగణంలో దివంగత మంత్రి దేవేంద్ర ప్రధాన్‌కు గౌరవ వందనం సమర్పణ



దేవేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: కేంద్ర మాజీ మంత్రి దేవేంద్ర ప్రధాన్ (84) మృతి చెందారు. ఢిల్లీలోని తన కుమారుడు, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నివాసంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహం సాయంత్రం రాజధాని నగరం భువనేశ్వర్‌కు చేరింది. ఈ ప్రాంగణంలో గౌరవ వందనం సమర్పించారు. స్థానిక విమానాశ్రయంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంత్రి మండలి సభ్యులు, స్పీకరు పలువురు ఇతర ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రముఖుల సంతాపం

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, విపక్ష నేత నవీన్ పట్నాయక్ పలువురు ఇతర ప్రముఖులు దేవేంద్ర ప్రధాన్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు దేవేంద్ర ప్రధాన్ 1999, 2004 మధ్య అటల్ బిహారీ వాజ్‌పేయి కొలువులో ఉపరితల రవాణా, వ్యవసాయ శాఖ సహాయ మంత్రిగా కొనసాగారు. ఆయన 3 సార్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేయడంతో సహా పార్టీలో వివిధ కీలక పదవులను సమర్థంగా నిర్వహించారు. ఆయన దేవ్‌గడ్ నియోజక వర్గం నుంచి 2 సార్లు లోక్ సభకు ఎన్నికయ్యారు. దేవేంద్ర ప్రధాన్ 1966లో కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నుండి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1967 సంవత్సరంలో తాల్చేర్ డేరాలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్‌గా తన వృత్తిపరమైన జీవనం ప్రారంభించారు. ఆరేళ్ల నామ మాత్రపు సర్వీసు తర్వాత స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసి 1973లో ప్రైవేట్ ప్రాక్టీస్ ప్రారంభించారు. 1980లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించి విశిష్ట రాజకీయ జీవితానికి నాంది పలికారు.



శ్రద్ధాంజలి ఘటించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



స్థానిక విమానాశ్రయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ని ఓదార్చుతున్న స్పీకరు సురమా పాఢి

ఘనంగా గంగమ్మ యాత్ర

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ప్రాధాన్యం ఉన్న నీలవడి అగ్ని గంగమ్మ యాత్ర ఘనంగా నిర్వహిస్తున్నారు. కొరాపుట్ జిల్లా బందుగాం సమితి అలమండ సమీపంలో నీలవడి వద్ద అమ్మవారు కొలువు తీరింది. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సంబరాలు మంగళవారంతో ముగియనున్నాయి. ఆ ప్రాంతమంతా రాత్రింభవళ్లు జాతరతో కళకళలాడుతోంది. పార్వతీపురానికి సమీపంలో ఉన్న ప్రాంతం కావడంతో తెలుగు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.



ఘటాలతో భక్తులు



నీలవడి అగ్ని గంగమ్మ



కొలువుదీరిన పూర్ణకుంభాలు

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా ఉన్న పర్లాకిమిడిలోని జైల్, కలెక్టరేట్ రోడ్డు

- పర్లాకిమిడిలో అధిక ఉష్ణోగ్రతలు
- 20, 21వ తేదీల్లో వర్షసూచన

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత ఐదు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల అధికంగా నమోదు అవుతున్నాయి. ఉదయం ఆరు గంటలకు పొగమంచు కురవడం, పది గంటల కల్లా కనీస ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు నమోదు అవుతుండటంతో జైల్ రోడ్డు, కలెక్టరేట్ రోడ్డు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మెట్రిక్, ప్లస్‌టూ పరీక్షలు పూర్తవ్వడంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఒడిశాలోని గజపతి, రాయగడ, భద్రక్, అనుగుల్, కటక్, ఖుర్దా జిల్లాల్లో వాతావారణ శాఖ ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఈ నెల 20న పలు జిల్లాలో తొలకరి వానలు కురుస్తాయని, మరికొన్ని జిల్లాలో కాలవైశాఖి సంభవించే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ మాజీ డైరక్టర్ డాక్టర్ శరత్ చంద్ర సాహు తెలిపారు.

ట్రాక్టర్ ప్రమాదంలో బాలిక దుర్మరణం

భువనేశ్వర్: భద్రక్ జిల్లా గుజిదొరొడా పోలీసు ఔట్ పోస్ట్ సమీపంలోని కమారియా ప్రాంతంలో సోమవారం ట్రాక్టర్ దూసుకుపోయి ఓ నాలుగేళ్ల బాలిక దుర్మరణం పాలైంది. మృతురాలు దుర్గాపూర్ ప్రాంతానికి చెందిన షేక్ సాబాజ్. ఆమె తండ్రితో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో ఆమె తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. ఆగ్రహించిన గ్రామస్తులు ట్రాక్టరుకు నిప్పు పెట్టారు. మంటల్లో ట్రాక్టర్ దగ్ధం అయింది.



మంటల్లో ట్రాక్టర్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పొందూరు: చేనేత మహిళలు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.అప్పలనాయుడు ఆకాంక్షించారు. స్థానిక దేవాంగ సంఘ గ్రంథాలయంలో నాబార్డు ఆధ్వర్యంలోని ఆర్ట్సు స్వచ్ఛంద సంస్థ సోమవారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ చేనేత, రైతు మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. తమ సంస్థలో చేనేత విభాగంలో 515 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు పొందిన జల్లేపల్లి కాంతమ్మతో పాటు మరో 60 మంది చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు.



జల్లేపల్లి కాంతమ్మను సన్మానిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా చైతన్యయాత్ర

• సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

విజయనగరం గంటస్తంభం: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా చైతన్యయాత్ర చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. కార్యక్రమంలో భాగంగా 46వ డివిజన్‌లో సోమవారం పర్యటించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఇళ్లు లేని పేదలకు రెండు సెంట్ల భూమి కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో చాలా మంది ఇళ్లు లేనివారు ఉన్నారని, అటువంటి వారందరికీ న్యాయం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చలో తహసీల్దార్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



దురుబిలి గ్రామ పరిసరాల్లో నిర్వహించిన దాడుల్లో స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ టబ్బులతో కురుపాం పోలీసులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని దురిబిల్లి గ్రామ పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా స్థావరాలపై సోమవారం నిర్వహించిన దాడుల్లో సుమారు 700 లీటర్ల పులియబెట్టిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేసినట్లు కురుపాం ఎస్సై పి.నారాయణరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి భారీగా ప్లాస్టిక్ టబ్బులను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

గంజాయితో ఐదుగురి ఆరెస్ట్



గంజాయి తరలిస్తున్న నిందితులను పట్టుకున్న పోలీసులు

గుర్ల: గంజాయి తరలిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గుర్ల మండలంలోని సొలిపిసోమరాజు పేట చంపావతి నదీపరీవాహక ప్రాంతంలో 1200 గ్రాముల గంజాయి తరలిస్తున్న నిందితులను పోలీసులు సోమవారం పట్టుకుని ఆరెస్ట్ చేశారన్నారు. అరెస్ట్ చేసిన వారిలో మండలంలోని సొలిపి సోమరాజు పేటకు చెందిన ఇద్దరు, దమరసింగికి చెందిన ఒకరు, నెల్లిమర్లకు చెందిన ఒకరు. జామి మండలం ఆలమండకు చెందిన ఒకరు ఉన్నట్లు తెలిపారు. నిందితుల దగ్గర నుంచి ద్విచక్ర వాహనం, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణరావు చెప్పారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రధాన్ హెంబర్న్

బొబ్బిలి: రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ సీతానగరం స్టేషన్ సమీపంలో జారిపడి ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. జార్ఖండ్‌లోని సొలిబురు ప్రాంతానికి చెందిన ప్రధాన్ హెంబర్న్ (23) సోమవారం చక్రధర్ పూర్ వెళ్లేందుకు రైలెక్కి సీతానగరం మండలం జగ్గునాయుడి పేట వద్ద జారి పడి మృతి చెందినట్టు రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. మృత దేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.నెలకు రూ.16వేల నుంచి రూ.20 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 70320 60773కి నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవం

పార్వతీపురంటౌన్: ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవంగా పాటిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గృహనిర్మాణ శాఖ అధికారులతో ఆయన సోమవారం మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 7వేల లక్ష్యాన్ని జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని గ్రామ పంచాయితీ అధికారులను ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎలాంటి భవన నిర్మాణాలు జరగరాదన్నారు. పింఛన్ల మంజూరుకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హేమలత, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పి. ధర్మచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సర్వే అధికారులను అడ్డుకున్న గిరిజన రైతులు

• 80 ఏళ్లుగా సాగు చేస్తున్నాం
• అధికారుల తప్పుడు నివేదికలతో ఫిర్యాదులు
• రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తాం



సర్వే అధికారులతో చర్చలు జరుపుతున్న గిరిజన, బీసీ రైతులు

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునికినవలస గ్రామ భూములు గత 80 ఏళ్లుగా సాగుచేస్తున్న గిరిజనులపై కొంతకాలంగా సాలూరుకు చెందిన చిట్లు శశికళ, మన్మథలు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ భూములు పూర్వం తమవని గిరిజనులు, కూర్మరాజుపేటకు చెందిన బీసీ రైతులు ఆక్రమించుకున్నారని కేసులు పెడుతున్నారు. ఈ విషయంలో పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాలకు గిరిజన రైతులను తిప్పించారు. ఈ భూములపై పూర్తి హక్కులు సాగుచేస్తున్న రైతులవేనని అధికారులు ఒక వైపు చెబుతూనే మరోవైపు వారు చేస్తున్న ఫిర్యాదులపై రైతులకు నోటీసులు జారీచేసున్నారు. అందులో భాగంగా సోమవారం స్థానిక రెవెన్యూ అధికారులు 50 మందికి పైగా గిరిజన, బీసీ రైతులకు నోటీసులు జారీచేసి వారి భూములు చూపించాలని గ్రామంలో సర్వే చేసేందుకు డీఆర్‌ఓ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతూ గ్రామంలోకి వచ్చిన సర్వే అధికారులను గిరిజన, బీసీ రైతులు అడ్డుకున్నారు. గత 80 ఏళ్లుగా తాము సాగుచేస్తున్నామని ఇప్పుడు వచ్చి ఎవడో పెట్టిన ఫిర్యాదుకు మాభూములు సర్వే చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదుదారులకు అధికారులు సహకరిస్తే రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేయాల్సి వస్తుందని గిరిజన రైతులు హెచ్చరించారు. అధికారులు ఇచ్చిన నివేదికలు సరిగా లేకపోవడంతో తమపై పదేపదే ఫిర్యాదులు చేసేందుకు ఆస్కారం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వెళ్లగక్కారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 32 ఫిర్యాదులు



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ వకుల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఎస్పీ వకుల్ జిందల్ నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో 32 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వకుల్ జిందల్ చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అక్కడికక్కడే బాధితుల ముందే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌ను ఆదేశించారు. ఎస్పీ వకుల్ జిందల్ అందుకున్న ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించినవి 7, మోసాలకు పాల్పడినవి 8, ఇతర అంశాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐలు ఏవీ. లీలారావు, ఆర్‌ఆర్ .చౌదరి, డీసీఆర్బీ ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం లేకుండా ఫిర్యాదుల పరిష్కారం



పార్వతీపురం రూరల్: ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులను అలసత్వం లేకుండా పరిష్కారం దిశగా విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదుల్లో సైబర్‌మోసాలు, కుటుంబ కలహాలు, తల్లిదండ్రులను వేధింపులు, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం తదితర సమస్యలపై ఫిర్యాదుదారులు ఎస్పీకి విన్నవించుకోగా వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి దర్యాప్తుచేసి వాస్తవాలైనట్లెతై చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ జ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పీజీఆర్ఎస్‌కు 54 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 54 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో భామిని మండలం బొడ్డగూడకు చెందిన బి.సింగన్న కిరాణా షాపు పెట్టుకోవడానికి రుణం ఇప్పించాలని కోరాడు. చేపల చెరువు మంజూరు చేయాలని నిమ్మలవలసకు చెందిన అప్పారావు కోరగా మండ గ్రామానికి చెందిన నిమ్మక పార్వతి, ఎన్‌టీఆర్ జలసిరిలో బోరు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. నౌగూడకు చెందిన ఆనందరావు ట్రాక్టర్ సబ్సిడీపై ఇప్పించాలని వినతిపత్రం అందజేశాడు. మేకలలోన్ మంజూరు చేయాలని అప్పారావు కోరగా రోడ్డు సదుపాయం కల్పించాలని జజ్జువ గ్రామస్తులు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీఈవో ప్రసన్నకుమార్, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్తంభానికి కట్టి కొట్టారు

• పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



విద్యుత్ స్తంభానికి కట్టి ఉన్న బాధితుడు శేఖర్

పాలకొండ రూరల్: మండలంలోని ఎల్ఎల్‌పురం గ్రామానికి చెందిన రేజేటి శేఖర్ తనను అదే గ్రామానికి చెందిన కొందరు విద్యుత్ స్తంభానికి కట్టి కొట్టారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై అందించిన వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన వారాడ రాజేంద్ర నాయుడు, ఆయన సోదరుడు సుమంత్ నిర్వహిస్తున్న శ్రీ సాయిలక్ష్మి టౌన్‌షిప్‌లో కొద్ది రోజులుగా ఏజెంట్‌గా శేఖర్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇళ్ల స్థలాల కొనుగోలుపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి రూ.కోటి వరకూ చెల్లించి వంద మందిని టౌన్‌షిప్‌లో సభ్యులుగా చేర్పించాడు. రోజులు గడుస్తున్నప్పటికీ నగదు చెల్లించిన వారికి ఇళ్ల స్థలాలను టౌన్‌షిప్ యాజమాన్యం కేటాయించకపోవడంతో పాటు సరైన సమాధానం ఇవ్వడం లేదు. దీంతో ఈనెల 16వ తేదీన ఎల్ఎల్.పురంలో గల టౌన్‌షిప్ నిర్వాహకుల ఇంటికి వద్దకు టౌన్‌షిప్ సభ్యులతో కలిసి శేఖర్ వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో నిర్వాహకులు లేరని వారి తల్లి తలియజేయగా చేసేది లేక తిరిగివెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీ సోమవారం ఉదయం బాధితుడు శేఖర్ ఊరి శివారులో కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి ఇంటికి వస్తుండగా టౌన్‌షిప్ నిర్వాహకుల బంధువులు వియ్యపు మురళి, సోదరుడు బొజ్జం నాయుడులు శేఖర్‌ను అడ్డగించి, డబ్బు అడిగేందుకు ఇంటికి వస్తావా? అంటూ దూషించి విద్యుత్ స్తంభానికి కట్టి కొట్టినట్లు ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గంట్యాడ: గంట్యాడ మండలంలోని బురదపాడు గ్రామానికి చెందిన చుక్క రాంబాబు (39) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 9వతేదీన పొలంలో పనిచేస్తుండగా రాంబాబును పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో సర్వజన ఆస్పత్రి వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేయగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

కాస్త పెరిగిన టమాటా ధర



వీరఘట్టం మండలం చిదిమి రోడ్డులో తరలించేందుకు సిద్ధంగా ఉన్న టమాటా

వీరఘట్టం: కొద్ది రోజులుగా టమాటాకు గిరాకీ లేక రైతులు నానా అవస్థలు పడ్డారు. కనీసం కిలో రూ.5కు ఇద్దామన్నా కొనుగోలుచేసేవారే కరువయ్యారు. టమాటా ఉత్పత్తి తగ్గడంతో ధర కాస్త పెరిగింది. వీరఘట్టం మార్కెట్‌లో కిలో రూ.10లు ధర పలకడంతో రైతులు ఊరట చెందారు.

21న జాబ్‌మేళా

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 21న సీతంపేట వైటీసీలో జాబ్ మేళా నిర్వహిస్తామని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ, అసెంబ్లీ ట్రైనీ, ప్రొడక్షన్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సుగల యువతీయువకులు అర్హులన్నారు. 6 కంపెనీలకు అవసరమైన 250 మంది ఉద్యోగులను ఎంపిక చేస్తాయన్నారు.

పశువుల దాహార్తికి నీటి కుండీలు



డివైడర్ల మధ్యలో ఏర్పాటుచేసిన నీటికుండీలు



నీటి కుండీల్లో నీటిని నింపుతున్న మున్సిపల్ సిబ్బంది



కుండీలో నీటిని తాగుతున్న పాడిఆవు

రాజాం: పట్టణంలో సంచరించే మూగజీవాలు, పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ అధికారులు నీటి కుండీలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రధాన రహదారిలో డివైడర్ల వద్ద కమిషనర్ జె.రామప్పలనాయుడు వాటిని ఏర్పాటుచేసి, వాటిలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్నారు. ఈ నీటికుండీల ద్వారా పాడిపశువులు, పక్షులు వేసవి దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

విద్యుత్‌షాక్‌తో కార్మికుడి మృతి



రామ్‌కుమార్ మృతదేహం

బాడంగి: మండలంలోని బొత్సవానివలస వద్ద చెరకు బెల్లంక్రషర్‌లో పని చేస్తున్న కార్మికుడు ఏడువాక రామ్‌కుమార్(25)విద్యుత్‌షాక్‌కు గురై సోమవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం డబ్బిరాజుపేటకు చెందిన రామ్‌కుమార్ పెద్దాపురం మండలం తాడిపత్రికి చెందిన బెల్లంక్రషర్ యజమానివద్ద పనిచేస్తున్నాడు. క్రషర్ ఆట ముగియడంతో క్రషర్‌కు సంబంధించిన సామగ్రిని రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఐషర్‌వ్యాన్‌లో లోడ్ చేస్తుండగా వ్యాన్‌పై ఉన్న విద్యుత్ హైటెన్షన్‌వైర్లు కనిపించకపోవడంతో అవి రామ్‌కుమార్ చేతికి తగలగా షాక్‌కు గురయ్యాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ ప్రత్యూష తనిఖీ చేసి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. మృతుని కుటుంబానికి సమాచారం అందించామని వారు వచ్చాక కేసు నమోదుచేసి పోస్టుమార్టం మంగళవారం నిర్వహిస్తామని చెప్పారు.

సందడి చేసిన కోర్ట్ చిత్రం యూనిట్



సినిమాహాల్‌లో అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతున్న చిత్రం యూనిట్

విజయనగరం టౌన్: నగరంలోని ఏసీవీసీ రంజని, శివరంజని సినిమా హాల్‌లో కోర్టు చిత్రం యూనిట్ సందడి చేసింది. చిత్రం యూనిట్‌కు థియేటర్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్రంలో మంగపతిగా నటించిన సీనియర్ నటుడు శివాజీ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విశేషంగా ఆదరించడం ఆనందంగా ఉందన్నారు. లాయర్‌గా నటించిన నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ పోక్సో చట్టం లోని లోటుపాట్లను ఆలోచనాత్మకంగా ఈ సినిమాలో చూపించామని చెప్పారు. పోక్సో చట్టం గురించి తెలియని కోణాలను ఈ సినిమాలో చూపించినట్లు తెలిపారు. హీరో, హీరోయిన్ రోషన్, శ్రీదేవిలు మాట్లాడుతూ తమ చిత్రానికి ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు రామ్ జగదీష్ మాట్లాడుతూ ఈ సినిమాలో చట్ట వ్యవస్థపై అవగాహన పెంచుతూ, నేటి యువతకు సందేశాత్మక చిత్రంగా రూపొందించామన్నారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ సాయి, ఇన్‌చార్జి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వివక్ష చూపొద్దు.. న్యాయం చేయండి

• వెటర్నరీ విద్యార్థుల మైమ్ కార్యక్రమం
• 42వ రోజుకు చేరుకున్న నిరవధిక దీక్షలు



దీక్షా శిబిరంలో వేషధారణలతో మైమ్ నిర్వహిస్తున్న వెటర్నరీ విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రభుత్వం తమ పట్ల వివక్ష చూపొద్దని..న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గరివిడి వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక దీక్ష శిబిరంలో మైమ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వెటర్నరీ కళాశాలకు వీసీఐ గుర్తింపును తీసుకురావాలని, స్టైపెండ్‌ను రూ.25వేలకు పెంచాలనే డిమాండ్లతో కళాశాల ఆవరణలో వెటర్నరీ విద్యార్థులు చేస్తున్న నిరవధిక దీక్ష సోమవారానికి 42వ రోజుకు చేరుకుంది. ఈ పోరాటంలో భాగంగా విద్యార్థులు కొద్ది రోజులుగా తమకు న్యాయం చేయాలంటూ నిరవధిక దీక్షలతో పాటు రోడ్డెక్కి భారీ ర్యాలీలు, నలుపు వస్త్రాలు ధరించి నిరసనలు, వంటావార్పు లాంటి వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా సోమవారం కూడా నిరవధిక దీక్షా శిబిరంలో ప్రభుత్వం తమ పట్ల వివక్ష చూపొద్దు..న్యాయం చేయాలంటూ వివిధ వేషధారణలతో వారి బాధను మైమ్ రూపంలో ప్రదర్శించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

• కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురటౌన్: వేసవి వేడిమి దృష్ట్యా పార్వతీపురం మన్యం జిల్లాలో చలివేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. వేసవి వేడిమి, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడిమి పెరిగిందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పనులు ఉంటేనే బయటకురావాలని, తెల్లని వదులు దుస్తులు వేసుకోవడం మంచిదని చెప్పారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతాల్లో నీడ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేతనదారులకు నీరు అందుబాటులో ఉంచాలని, ఎండ ఎక్కువగా ఉండే సమయాల్లో పనివేళలో మార్పులు చేసుకోవాలని సూచించారు. రోజు రోజుకూ పెరుగుతున్న వేడిమి దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. కొబ్బరి బొండాలు, పానీయాలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల ర్యాలీ



కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీలో పాల్గొన్న నిరుద్యోగులు

• కేసులు పరిష్కరించి మెయిన్స్ పరీక్ష పెట్టాలి
• కలెక్టర్‌కు వినతిపత్రం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డీవైఎఫ్‌ఐ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉన్న హోంగార్డు రిజర్వేషన్ కేసును పరిష్కరించి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, సోమవారం డీవైఎఫ్ఐ అధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు కానిస్టేబుల్ అభ్యర్థులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ జిల్లా కన్వీనర్ సీహెచ్. హరీష్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో కానిస్టేబుల్ నోటిఫికేషన్ 2022 నవంబర్ 28న విడుదల చేశారన్నారు. 2023 జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్షకు 4,59,182 మంది హాజరై ప్రిలిమ్స్‌లో 95,208 మంది అర్హత సాధించారని, ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసులు, 2024 డిసెంబర్ 22 నుంచి జనవరి 16 వరకు ఈవెంట్స్ జరిగాయి. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది మాసాలు అవుతున్నా నిరుద్యోగుల గురించి ఎక్కడా మాట్లాడని పరిస్థితి అని వాపోయారు. విద్యాశాఖ మంత్రి లోకేష్, హోం మంత్రి అనిత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల పర్యటనలో భాగంగా కానిస్టేబుల్ ఎగ్జామ్‌ను ఆరుమాసాల్లో భర్తీ చేసి రిక్రూట్‌మెంట్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇంతవరకు దీని గురించి ఎక్కడా అధికారులు ప్రస్తావించలేదు. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత అంతా వ్యవసాయ ఆధారిత కుటుంబం నుంచి వచ్చి పట్టణంలోని ఉన్న రీడింగ్ హాల్లో, కోచింగ్ సెంటర్‌లో ఫీజులు కట్టుకోలేక, కోట వద్ద లైబ్రరీలోని రాత్రింబవళ్లు ఉద్యోగం కోసం నిరంతరం చదువుతూనే ఉన్నారు. మరో ఉద్యోగం కోసం వెళ్లలేని పరిస్థితి. నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని, ప్రభుత్వం తక్షణమే కోర్టులో ఉన్న కేసులు పరిష్కారం చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు బి.సతీష్, నాగరాజు,శివ, లక్ష్మి, జయలక్ష్మి, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

69 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి అర్హత పత్రాలను అందజేస్తున్న ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: జిల్లాలోని 69 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి లభించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వర్రావు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, ఉద్యోగోన్నతులు కల్పించారు. వారి అభీష్టానికి అనుగుణంగా పోస్టింగులు కేటాయించారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 57 మందికి గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే గ్రేడ్-4 కార్యదర్శులు వివిధ కారణాలతో ఉద్యోగోన్నతిని తిరస్కరించారు. మిగిలిన 8 మంది కొత్త స్థానాల్లో చేరారు. ఉద్యోగోన్నతి లభించిన పంచాయతీ కార్యదర్శులకు జిల్లా ఇన్‌చార్జ్ జేసీ ఎస్.శ్రీనివాసమూర్తి పత్రాలను పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.